సీరియల్ కథ :

# ప్రేమ పుష్పాలు!

★




ర చ న :

శ్రీ బుద్ధిరాజు నరసింహారావు


చక్రవ ర్తి చెంప ఛెళ్ళుమంది, కళ్ళల్లో అప్రయత్నంగా నీరు నిండుకుంది. కొద్దిదూరంలోనే కాలేజీ గార్డెన్ చెట్లనీడలో కూర్చున్న విద్యార్థులు గొల్లుమన్నారు.

'అబ్బ....ఎంతదెబ్బ పడిందిరా ....!'

'అయ్యో పాపం.... జూలియట్ దెబ్బ రోమియోకి గట్టిగా తగిలినట్లుందే?'

'అందుకేరా నాయనా పెద్దలన్నారు....నిప్పుతో ఆటలాడకురా అని.'

విద్యార్థుల వ్యంగ్యవాక్యాలు శూలాల్లా గుచ్చుకుంటున్నాయి చక్రవ ర్తికి....ఎంత అవమానం!

అయినా జయసుధకి ఎదురుగా అలాగే నిలబడ్డాడు చక్రవ ర్తి.

'మీరు నన్ను తప్పుగా అర్థం చేసుకున్నారు జయసుధగారూ! నేను మిమ్మల్ని ప్రేమభిక్ష అడగడానికి రాలేదు. ప్రేమ్‌కుమార్‌తో కలిసి కట్టుగా ఉంటే అతనిని మీరు ప్రేమిస్తున్నారని అనుకున్నాను. నాగురించి మీకు బాగా తెలియదు జయసుధగారూ, నాగురించి....నా కేరక్టర్‌గురించి ప్రిన్సిపాల్‌గార్ని అడిగి తెలుసుకోవచ్చు. ఇప్పటివరకు నా గురించి ఎటువంటి కంప్లెంట్ లేదు. ఇలా పదిమందిలో నవ్వులపాలు కావడం, అవమానం పడడం ఇదే ప్రథమం. ఈలోకం తీరంతేలెండి. ఈకాలంలో మేలు చేయబోతే ఫలితం ఇలా దక్కుతుంది. పోనీలెండి, నే చెప్పేది సూటిగా....' అంటూ చక్రవ ర్తి యింకా ఏదో చెప్పబోతే, అతనిమాటను కొట్టిపారేస్తూ జయసుధ క్రోధావేశాలతో 'ఆపండి' అంది.

చక్రవ ర్తి కళ్లెత్తి ఆమెవైపు చూశాడు. అతనికళ్ళల్లో గాని, ముఖంపైనగాని యెటువంటి భావమూ లేదు. శాంతంగా తదేకంగా ఆమె కళ్ళల్లోకి చూసాడు.

'మీ ఫిలాసఫీ ఆపుతారా, లేక ....!'

ఆమె తన పాదాలవైపు సౌజ్ఞ చేసింది.

'నామాట పూ ర్తికాకుండా కదిలేదిలేదు జయసుధగారూ! ప్రేమ్‌కుమార్ మీ రనుకుంటున్నంత ఉత్తముడు కాడు. మిమ్మల్ని తనవలలో వేసుకుని మోసం చేస్తాడు. మాటలతో మైమరపించి, దగాచేసి మీ సర్వస్వం....!' అంటూ చక్రవ ర్తి దృఢంగా యింకా యేదో అనబోయాడు.

కానీ అంతలోనే అతని దవడమీద ఎవరో బలంగా గుద్దడంతో వెనక్కి తిరిగాడు.

ఎదురుగా ప్రేమ్‌కుమార్ !

'ఏంరా....రాస్కెల్....యిది కాలేజి అనుకున్నావా, లేక కూరగాయలు బేరం చేసే సంతనుకున్నావా?....ఒక ఆడపిల్ల....అదైనా తోటివిద్యార్థిని వంటరిగా కూర్చుని చదువుకుంటూవుంటే....పదిమందిలో అవమానపరచడానికి నీ కెన్నిగుండెలురా ఫూలిష్‌ఫెలో....నీ అంతు చూస్తాను... నే నెవర్ననుకుంటున్నావు? . నాపేరు... నాపేరు ప్రేమ్ కుమార్....' అని ప్రేమ్‌కుమార్ కోపావేశాలతో కంపించిపోతూ చక్రవర్తిపై విరుచుకుపడ్డాడు.

విద్యార్థీ, విద్యార్థినీలు గుంపుగా వారిని చుట్టుముట్టారు.

చక్రవర్తి జవాబు చెప్పలేదు.

ప్రేమ్‌కుమార్ తనని క్రిందపడేసి గుండెలమీద బాదుతున్నా మౌనంగా వూరుకున్నాడు.

చక్రవర్తి పెదవులనుండి రక్తం వెలువడింది. జుట్టు రేగిపోయింది. షర్టు గుండీలు తెగిపోయాయి. షర్టు చిరిగిపోయింది.

మళ్ళా కొట్టడానికి ప్రేమ్‌కుమార్ చెయ్యెత్తబోతే కొందరు విద్యార్థులు అడ్డుపడి యిద్దరినీ విడిపించారు.

'వదలండి ...ఈ రాస్కెల్‌ని చంపిపారేస్తాను....' ప్రేమ్‌కుమార్ ఆవేశంగా అరిచాడు.

'చక్రవర్తి....నీ వీక్కడనుండి వెళ్ళు....కాలేజీలో యిలాంటిగొడవలు మంచివికావు. నువ్వుకూడా శాంతించు ప్రేమ్....ఏమిటా వెర్రి ఆవేశం ...!'

మోహన్ నచ్చజెప్పాడు.

చక్రవర్తి మౌనంగానే కుడిచేతితో పెదవులనుంచి కారుతున్న రక్తం తుడుచుకుంటూ తల దించుకుని కాలేజీ గేటునుంచి బయటకు వెళ్ళిపోయాడు.

మెల్లిగా విద్యార్థులుకూడా జారుకున్నారు.

ప్రేమ్‌కుమార్ పెద్ద హీరోలా బట్టలు దులుపుకుని జయసుధవైపు గర్వంగా చూసాడు.

కాని....అక్కడ జయసుధ లేనేలేదు.




ఎల్. పి. సి. మోనోబ్లాకు రెండు స్టేజీ డీప్ వెల్

**- జెట్ పంపులు -**

రెండుస్టేజి పంపులు ఎక్కువగా అతిప్రెషర్‌లో సాధారణ జెట్ పంపుకన్నా నీళ్ళ నందించును.

ఎంత లోతైన బావినుండి అయినా సరే మా మోనోబ్లాకు జెట్ పంపు సెట్టులు అతిసులువుగా మీకు నీళ్ళు అందించును ½ H.P. నుంచి 5 H.P. వరకు దొరకును.

———— వివరములకు ————

Grams : "NAIDUBROS" Phone : Office : 24997 Works : 22757

**THE EL-P-EM INDUSTRIALS**

393, Mettupalaym Road, (P.B. No. 1053) COIMBATORE-641 002

**SALES BRANCHES :–**

**112, Zeera, Secunderabad - 3.**

**13/85, Jayachamarajendra Road, Bangalore - 2.**

**10, Municipal Market Building, Kokkalai, Trichur - 1.**

ఈగొడవలో ఆమె అక్కడనుంచి ఎప్పుడు వెళ్ళిపోయిందో ప్రేమ్‌కుమార్ గమనించలేదు.

* * *

ఆరాత్రి బయట హోరుమని వర్షం పడుతోంది.

ఆకాశమంతా కారుమబ్బులు కమ్ముకున్నాయి.

పెళపెళమని ఉరుములూ, మెరుపులూ వాతావరణాన్ని మరీ గంభీరంగా చేస్తున్నాయి.

అదొక చిన్నగది. జీరోవాట్స్ బల్బు వెలుగుతోంది.

మంచంమీద పడుకున్న జయసుధకి ఎంత ప్రయత్నించినా నిదుర రావడంలేదు. ఏవేవో పిచ్చి ఆలోచనలు!

ప్రేమ్‌కుమార్ తనకి అంతదగ్గరగా ఎలా వచ్చాడో అర్థం కాలేదు.

* * *

అతను బి. ఏ. ఫైనల్ స్టూడెంటు. తను మూడునెలల క్రితం ఆ కాలేజీలో జాయన్ అయింది. అంతకుముందు విజయవాడలో చదువుకునేది, తను యింటర్ ఫైనల్.

జయసుధ అసలు యువకులకి దూరంగా వుండే రకం. ఎవరైనా సాధారణంగా అంత త్వరగా ఆమె నాకర్షించలేరు. కాని....కాని....ప్రేమ్‌కుమార్ ఒక మంచి ఆర్టిస్టని, పేరు ప్రతిష్టలు చెందిన విభిన్నపత్రికలలో 'ప్రేమ్' అనే పేరుతో వచ్చేబొమ్మలన్నీ అతను వేసినవేనని తెలిసినప్పుడు ఎందుకో జయసుధ గుండె జోరుగా కొట్టుకుంది, అదో తెలియని హాయి!

తను 'ప్రేమ్' బొమ్మలు ఎన్నో పత్రికలలో చూసింది. తనకి అతనువేసే బొమ్మలలో చాలా యిష్ట. తన ఆల్బంలో కూడా బోలెడు చిత్రాలు కట్ చేసి పెట్టుకుంది.

రోజులు గడుస్తున్నకొలది ప్రేమ్‌కుమార్‌తో ఒక్కసారి కలియాలని....అతను వేసినచిత్రాలకు శుభకాంక్షలు తెలపాలని....అతనితో మాట్లాడాలని హృదయం తహతహలాడింది.

రెండోరోజే లైబ్రెరీలో ప్రేమ్ తనకి వంటరిగా కనిపించాడు. ఆమె అతణ్ణి కలిసింది. అభినందించింది.

ప్రేమ్‌కుమార్ సంతోషంతో ఎగిరిపడ్డాడు.

జయసుధని అంత త్వరగా ఆకర్షించగలిగాడంటే అది తన అదృష్టమేనని లోలోన మురిసిపోయాడు.

తర్వాత రెండురోజులకు ప్రేమ్‌కుమార్ ప్రథమంగా ఒక ప్రేమలేఖ వ్రాసి పుస్తకంలోపెట్టి అందించాడు.

జీవితంలో సరికొత్త అనుభవం!

ప్రేమ్‌కుమార్ ఏవేవో అలంకారాలతో పిచ్చిగా తనని వర్ణించాడు.

తను చదువుకుని నవ్వుకుంది.

'తను అంత అందగత్తా?' అని లోలోన మురిసిపోయిందికూడా.

వెంటనే తనూ అతనికి జవాబు వ్రాసింది. ఆవిధంగా యిద్దరిమధ్యా ప్రేమలేఖల వ్యవహారం ప్రారంభమై వారి ప్రేమకు నాంది పాడింది.

రోజులు గడుస్తున్నకొలది యిద్దరిమధ్యా ప్రేమ అభివృద్ధి చెందింది.

* * *

అంతలో చక్రవర్తి....!

బి. ఏ. ఫస్టియియర్ స్టూడెంటు!

కాలేజీలోవున్న విద్యార్థులందరితో మిక్కిలి శాంతంగా, నిరాడంబరంగా వుండే చక్రవర్తి!

తను వస్తూ పోతూ చక్రవర్తిని చాలాసార్లు చూసింది. తోటి విద్యార్థినులు రాధా, గీతా చక్రవర్తిని పొగుడుతూ, ఎన్నో కబుర్లు చెప్పారు. కాని ఎందుకో తనకి చక్రవర్తి అంతగా నచ్చలేదు.

తన ప్రేమ వ్యవహారంలోకూడా అడ్డు పడబోయాడు చక్రవర్తి. తనకి కోపం వచ్చింది. హుం!....ప్రేమ్

బపితావారి...
ప్రత్యేక తయారింపులు
• సీఫోర్, • చూస్త్రీ,
• రావ్ టూ, • సెలెక్ట్ ఒన్
• డట్ సెలెక్షన్.
ఇవే మా ప్రత్యేక తయారింపులైన
జెట్టీలు - బనియన్లు.
తయారించువారు :
Phone: 22909
**BAPITHA KNITTERS**
**Lakshmi Nagar, Tirupur - 638 602.**

కుమార్ మంచివాడు కాడు ... దగా చేస్తాడు.... మోసగాడని పిచ్చివాగుడు. తను గట్టిగానే లెంపకాయ కొట్టింది. దానికి తోడు ప్రేమ్‌కుమార్‌కూడా ఓ నాలుగంటించాడు. అబ్బాయి గార్కి బుద్ధి వచ్చేవుంటుం దీపాటికి....

ఆలోచనలతో మంచంపై దొర్లుతున్న జయసుధకి ఎప్పుడు నిదుర వచ్చిందో తెలియనేలేదు.

బయట హోరుమని వర్షం పడుతూనేవుంది.

* * *

'లేమ్మా జయా.... ఎనిమిదై పోయింది।

తల్లి పిలుపుకి తుళ్ళిపడింది జయసుధ.

'అరే.... యింతసేపూ పడుకునే వున్నానా?'

కళ్ళు నులుపుకుంటూ బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంది జయసుధ.

'ఏం జయా, ఒంట్లో బాగాలేదా? కళ్ళెందు కంత ఎర్రగా వున్నాయి?' తల్లి ఆప్యాయంగా ఆమె నుదురు మీద చేయివేస్తూ అడిగింది.

'అబ్బే, అదేం లేదమ్మా, బాగానే వున్నాను. రాత్రి కాస్త తల నొప్పిగా వుంది.'

'నన్ను లేపలేకపోయావా, సారిడాన్ వుందికదా నా దగ్గర.'

'అస్తమానం మాత్రలూ, మందులూ వేసుకోవడం మంచిదికాదని వేసుకోలేదమ్మా. అది సరేగాని, నాన్నగారు ఆఫీసుకి వెళ్ళిపోయారా?'

'ఈరోజుకూడా ఆఫీసులో ఏదో అర్జెంటుపని వుందని త్వరగా వెళ్ళిపోయారు. ఏమిటో ఆయన మరీను. ఆ సేట్ యిచ్చేది నెలకి రెండువందలైనా ఆయన ఒళ్ళుమరచి పని చేస్తారు. అయినా ఆ సేట్‌కి జాలి లేదు. ఏళ్ళతరబడి కష్టపడి చెమటలు కార్చుకుని పనిచేసినా యిప్పటివరకూ ఒక్క పైసా అయినా పెంచలేదు. వాళ్ళ ఆఫీసులో తోటివారు సేట్ కళ్ళుకప్పి దొంగచాటుగా కంట్రాక్టర్లదగ్గర డబ్బు గుంజి, వాళ్ళ మెప్పుపొంది, ప్రమోషన్లుపొంది గొప్ప వాళ్ళుగా చలామణీ అవుతున్నారు. ఈయన అమాయకంగా లంచాలకి ఎదురు నిలబడ్డారు. వాళ్ళకేమీ అవలేదు, కాని చివరికి ఈయనకు మిగిలిందేమిటి? ఆ కంట్రాక్టర్లు ఈయనకి ఎదురుతిరిగారు. ఈయనే పెద్ద లంచగాడని ఆ సేట్ చెవిలో వూదారు. అంతేనమ్మా। ఈకాలంలో నీతికీ నిజాయితికీ తావులేదు. లంచాలు పుచ్చుకుని, యితరులని దగా చేసి, మోసంచేసి డబ్బుగుంజి పెద్ద భవంతులు కట్టుకుని దర్జాగా బ్రతికేవాళ్ళే గొప్పవాళ్ళు.'

తల్లి బాధగా అనగా జయసుధకికూడా బాధ అనిపించింది.

'నాన్నగారి వ్యక్తిత్వమే అంత .. బాధపడకమ్మా.... ఏదోరోజున నాన్నగారి గొప్పతనం తప్పక గుర్తింపబడుతుంది' అంది తల్లికి నచ్చచెబుతూ.

'ఆరోజు ఈజన్మలో రాదని నా అనుమానం జయా।'

'ఎందుకలా అంటావమ్మా?'

'అది నా అనుభవం, అంతే జయా.... మీ నాన్నగారి గొప్పతనం నే వివరించి చెప్పలేదు.'

తల్లి యింకేదో అనబోతూవుంటే, పదిహేనేళ్ళ ప్రభ అక్కడికి వచ్చింది.

'అమ్మా, నాన్నగారి చొక్కా ఎక్కడుంది. ఉతికి వుంచమన్నారుకదా?'

'పద, వస్తున్నాను.' అంటూ ప్రభతోనే తల్లి బయటకు వెళ్ళిపోయింది.

జయసుధ లేచి కాలకృత్యాలు పూర్తిచేసుకుని వచ్చే లోపల తల్లి కప్పులో వేడి కాఫీ రెడీచేసి వుంచింది.

గదిలో చాపమీద కూర్చుని ప్రభ ఏదో వ్రాసుకుంటున్నది.

'ఏం చేస్తున్నావు ప్రభా?'

కాఫీ సిప్ చేస్తూ ప్రభకి ఎదురుగా చాపమీద కూర్చుంది జయసుధ.

'అక్కా.... ఈ లెఖ్ఖ నాకు రావడంలేదు.... చేసి చూపెడతావా?'

'ఓ.... తప్పకుండా.... ఏదీ?' ఖాళీ కప్పు గోడవారగా పెడుతూ అడిగింది జయసుధ.

'ఎక్సర్‌సైజు నెంబర్ ఫిఫ్టీన్....'

'ఇంత ఈజీ లెఖ్ఖలు రావా...' అని ఆ లెఖ్ఖ చేసి చూపెట్టింది.

చాలాసేపు ప్రభకి లెఖ్ఖలుచెప్పి గడియారం తొమ్మిది గంటలు కొట్టగానే, 'బాబాయి.... తొమ్మిదీ.... యింకా స్నానంకూడా చెయ్యాలి.... ప్రభా.... యిల్లొకసారి తుడిచి పెడతావా.... మామంచి చెల్లివికదూ....'

'సరే అక్కా !'

ప్రభ పుస్తకాలు సర్ది లేచింది.

* * *

ఆరోజు కాలేజీలో ప్రేమ్‌కుమార్ మరో లేఖ అందించాడు.

ఇంటికి రాగానే కాఫీతాగి, 'డాబామీదికివెళ్ళి చదువుకుంటానమ్మా' అని డాబామీదకు వెళ్ళింది జయసుధ.

ప్రేమ్‌కుమార్ వ్రాసినలేఖ పుస్తకంలోంచి తీస్తూవుంటే ఆనందంతో చేయి వణికింది. తనువు పులకరించినట్లయింది.

'ప్రియాతి ప్రియమైన జయకి—

నామదిలో స్వప్నసుందరివలె విహరించే వలపులరాణికి-

ఎందుకు నన్నిలా వేధిస్తావు జయా ?

ఏం....నన్ను హింసించడంలో నీకు హాయిగా వుంటుందా ?

జయా....నిజం చెప్తున్నాను....రాత్రిపూట నాకసలు నిదుర రావడంలేదు. కళ్ళు మూసుకుంటే చాలు, ఎదురుగా నీరూపమే ప్రత్యక్షమవుతుంది, ఎల్లప్పుడూ నీమీదే ధ్యాసంతా.

అమ్మ నేను సరిగ్గా భోజనం చెయ్యడంలేదని నాన్నతో ఎప్పుడూ కంప్లయింటు చేస్తూనే వుంటుంది.

వారికేం చెప్పమంటావు ?

నా ఆకలు...నిదుర...సర్వస్వం నీవు దోచుకున్నావని ఎలా చెప్పను ?

సరేలే...సాయంత్రం సరిగ్గా ఆరుగంటలకు హోటల్ తాజ్‌వద్ద తప్పకుండా కలుసుకోవాలి. నీ రాకకై వేయి కనులతో ఎదురుచూస్తూ వుంటాను.

ఎలాగైనా వస్తావుకదూ ?

నాకు తెలుసు...నాజయ నామాట కాదనదని.

ప్రేమతో,

నీవాడు,

**'నీవాడే'**

ఆ లేఖ పూర్తి చెయ్యగానే జయసుధ ఎప్పుడో స్వర్గ సీమలలో విహరిస్తున్నట్లు ఫీలయింది.

నిజంగానే..,తనుకూడా ప్రేమ్‌కుమార్‌ని విడిచి ఒక్క క్షణం వుండలేదు...ఎల్లప్పుడూ అతని దృఢమైన బాహువులు తనకి తోడుగా వుండాలని, అతని కౌగిటిలో యిమిడిపోవాలని హృదయం తహతహలాడుతూ వుంటుంది.

వెంటనే రిస్టువాచీ చూసుకుంది.

అయిదూనలభై అయిదు ! అయింది.

(సశేషం)



***

జయకృష్ణా ఫిలింసువారి

**"వీరభద్రుడు"**

చిత్రంలో

మాదాల రంగారావు

***